
సాక్షి తిరుపతి

గురువారం । 28 । డిసెంబర్ । 2023



నిరుపేదలకు 'నీడ' కుదిరె!

నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద స్వగృహాలు పొందిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - 8లో



భూమనతోనే బలిజ బిడ్డల భవిష్యత్

బలిజ బిడ్డల భవిష్యత్‌కు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కృషి చేస్తున్నారని బలిజ సంఘం నేతలు తెలిపారు. - 8లో



ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం'

ఆడుదాం ఆంధ్ర పేరిట ప్రభుత్వం దేశంలోనే అతి పెద్ద టోర్నీ నిర్వహిస్తోందని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి వెల్లడించారు. - 8లో

న్యూస్‌రీల్

పక్కాగా ఓటరు దరఖాస్తుల పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫారమ్–7, 8 క్లెయిమ్స్, అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓల స్థాయిలోనే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు దరఖాస్తుల క్వాలిటీ డిస్పోజల్ ఉండాలని స్పష్టం చేశారు. మార్పులు చేర్పులతో జనవరి 22వ తేదీన ఫైనల్ పబ్లికేషన్ జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, ఆర్డీఓలు చంద్ర ముని, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జేసీని కలిసిన తుడా చైర్మన్



జేసీని సత్కరిస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను తుడా చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. పలు అభివద్ధి అంశాలపై చర్చించారు. మంగళంలో పట్టాల పంపిణీ కార్యక్రమంపై మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి పాల్గొన్నారు.

నృసింహుని హుండీ లెక్కింపు



హుండి లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

రాపూరు : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. శ్రీవారి నిత్య కల్యాణమండపంలో చేపట్టిన హుండీ లెక్కింపులో 90 రోజులకు గాను మొత్తం రూ.98,87,425 ఆదాయం వచ్చినట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి, పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే 150 గ్రాముల బంగారం, 4.03 కేజీల వెండి వచ్చినట్లు వెల్లడించారు.

పర్యాటక అభివృద్ధికి సమష్టి కృషి



రాయలసీమ చాప్టర్ నూతన కమిటీ

తిరుపతి కల్చరల్: టూర్ ఆపరేటర్ల సమష్టి కృషితో పర్యాటకరంగం అభివృద్ధికి దోహదపడాలని టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ చైర్మన్ విజయ్‌మోహన్ కోరారు. బుధవారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గుజరాత్ టూరిజం, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టూర్ ఆపరేటర్స్ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకం రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరించారు. గుజరాత్ టూరిజం ప్రతినిధి అజిత్‌కుమార్ శర్మ మాట్లాడుతూ దేశ పురోగతిలో పర్యాటకం వహిస్తున్న పాత్రను తెలియజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ రాయలసీమ అధ్యక్షుడు కె.వెంకటచౌదరి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నిలపడానికి అందరూ కలసికట్టుగా నడవాలని కోరారు. అనంతరం టూర్స్ అండ్ ట్రావెల్స్ రాయలసీమ చాప్టర్ నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కోదండరామ్, సీనియర్ ఉపాధ్యక్షుడిగా అనిల్, ఉపాధ్యక్షులుగా రామ్మూర్తి, ప్రమోద్‌కుమార్, కార్యదర్శిగా రమేష్‌బాబు, సహాయ కార్యదర్శిగా బాబ్జీ ఎంపికయ్యారు.





మంగళవారం నిర్వహించిన టీటీడీ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి

వేదన తీరె..
వేతనం పెరిగె!

ఆధ్యాత్మిక క్షేత్రంగా విశ్వవిఖ్యాతం.. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు కొలువైన ఇల వైకుంఠం.. నిత్యం తరలివచ్చే అశేష భక్తజనం.. ఏడుకొండలస్వామి దర్శనభాగ్యం కోసం విచ్చేసే లక్షలాది మందికి టీటీడీ ఉద్యోగులు అందిస్తున్న సేవలు అనన్యసామాన్యం. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా శ్రీవారి సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తుంటారు. తిరుమల పవిత్రత పరిరక్షణకు అనుక్షణం పరితపిస్తుంటారు. భక్తుల సేవే భగవంతుని సేవగా భావిస్తుంటారు. అంతటి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించే ఉద్యోగుల శ్రేయస్సే లక్ష్యంగా టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక చొరవతో ప్రశంసార్హమైన నిర్ణయం తీసుకుంది. మరింతగా కార్యోన్ముఖులను చేసేందుకు స్వచ్ఛందంగా వేతనాలు పెంచాలని పాలక మండలి తీర్మానించింది.

- చిరుద్యోగుల సేవలకు టీటీడీ ప్రోత్సాహం
- స్వచ్ఛందంగా జీతాలు పెంచుతూ నిర్ణయం
- ప్రత్యేక చొరవ తీసుకున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న సిబ్బంది

సాక్షి, తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్, ఈఓ ఎల్లప్పుడూ శ్రీవారి భక్తులకు విశిష్ట సేవలందించేందుకే కట్టుబడి ఉంటారని మరోసారి రుజువైంది. వైకుంఠనాథుని దర్శన భాగ్యం కోసం తిరుమలకు వచ్చే భక్తులు సంతృప్తి చెందేలా సేవలందాలంటే ముందు టీటీడీలో పనిచేసే ప్రతి ఉద్యోగి కుటుంబం సంతోషంగా ఉండాలని చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి భావించారు. అందుకే టీటీడీ ఉద్యోగులు అడగకపోయినా వారి వేదన గుర్తించి, వేతనాలు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. కల్యాణకట్టలో పనిచేసే క్షురకులు, పోటు కార్మికులు, వర్క్ కాంట్రాక్ట్ ఉద్యోగులపై వరాల జల్లు కురిపించారు.

'పీస్ రేట్' వారికి ఊరట

తిరుమల కల్యాణ కట్టలో కొన్నేళ్లుగా పీస్ రేట్ (గుండుకు ఇంత లెక్కన) పని చేస్తున్న క్షురకులను మునుపెన్నడూ గుర్తించిన దాఖలాలు లేవు. ఎవరూ ఊహించని విధంగా వారికి జీతం నిర్ణయించారు. వీరి బాధలు, ఇబ్బందులు మంచి మనసుతో ఆలోచించి నెలకు రూ.20 వేల కనీస వేతనం అందించాలని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. దీంతో సుమారు 250 కుటుంబాలకు మేలు చేకూరుతోంది. అలాగే టీటీడీలో శాశ్వత ఉద్యోగులు కాని పోటు కార్మికులకు మరో రూ.10వేలు అదనంగా జీతం ఇవ్వనున్నారు. దీంతో మరో 350 కుటుంబాలకు లబ్ధి కలుగుతోంది. వాహన బేరర్లు, ఉగ్రాణం కార్మికులను స్కిల్డ్ లేబర్‌గా గుర్తించి వేతనాలు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. ఇంకా టీటీడీలో వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు కార్మికుల జీతాలను కనీసం రూ.3 వేలు పెంచాలని తీర్మానించారు. దీంతో సుమారు 2 వేల మంది కార్మికులు ప్రయోజనం పొందనున్నారు. ఇకపోతే టీటీడీలోని ప్రతి ఉద్యోగికి, రిటైర్డ్ ఉద్యోగికి ఇంటి స్థలం ఇప్పించే బాధ్యత తీసుకున్న చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తన మాట నిలుపుకుంటున్నారు. తొలి విడతగా 3,518 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు గురువారం తిరుపతి మహతి ఆడిటోరియంలో పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. వారం, పది రోజుల్లోనే మరో 1,500 మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మిగిలిన వారి కోసం మరో 350 ఎకరాలను సేకరించి ఫిబ్రవరి లోపు ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి టీటీడీ బోర్డు తీర్మానం చేయడం విశేషం.

వెల్లువెత్తిన హర్షాతిరేకాలు

వేతనాల పెంపుపై పోటు కార్మికులు, వాహన బేరర్లు, ఇతర సిబ్బంది హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. అడగకపోయినా స్వచ్ఛందంగా ఇంత మేలు చేసిన టీటీడీ బోర్డు చైర్మన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలోనే టీటీడీ ఎంప్లాయీస్ నాయీ బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్ మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. క్షురకులకు కనీస వేతనం అందించటంతో పాటు ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఏటా 3శాతం ఇంక్రిమెంట్ అందించనుండడం అభినందనీయం. ఈ మేరకు జీవితంలో మరచిపోలేని సహాయం చేశారని కొనియాడారు.

నేడు ఇంటి పట్టాల పంపిణీ

టీటీడీ ఉద్యోగులకు గురువారం ఉదయం స్థానిక మహతి ఆడిటోరియంలో ఇంటి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు టీటీడీ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ సభ్యులు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక టీటీడీ పరిపాలన భవనం పాత క్యాంటీన్ ప్రాంగణంలో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాదిరేడు సమీపంలో సుమారు 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన 3,518 ప్లాట్లను డిప్ ద్వారా ఉద్యోగులకు కేటాయించారని వెల్లడించారు.

ఎస్వీయూ వీసీగా శ్రీకాంత్‌రెడ్డి



తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ నూతన వైస్ చాన్సలర్‌గా ఆచార్య వి.శ్రీకాంత్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాంత్ రెడ్డి 1992లో సహాయ ఆచార్యులుగా ఎస్వీయూలోనే సైకాలజీ విభాగంలో పనిచేశారు. అనంతరం ఆయన అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతులు పొందారు. తర్వాత ఎస్వీయూ పీఆర్‌ఓగా, సైకాలజీ విభాగాధిపతిగా, సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా, ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించారు. 2021–22లో ఎస్వీయూ రెక్టార్ పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం వీసీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తునట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య శ్రీమురళి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ పరిధిలో ఖాళీగా ఉన్న కళాశాల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 30వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి, స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఐసెట్‌లో ర్యాంకులు పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని , గతంలో అడ్మిషన్లు పొందినవారు అనర్హులని వివరించారు. అయితే స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఎస్వీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఆగమోక్తం.. అభిషేకం



స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని నటరాజస్వామి, శివకామి సుందరి ఉత్సవ మూర్తులకు ఆగమోక్తంగా అభిషేకం నిర్వహించారు. ముందుగా నటరాజస్వామి సన్నిధిలో ఉత్సవర్లను కొలువదీర్చి కలశ ప్రతిష్ట, గణపతి పూజ చేపట్టారు. అనంతరం ఉత్సవర్లను పాలు, పెరుగు, తేనె, చందనం, పంచామృతం, నారికేళ జలాలు, విభూదితో అభిషేకించారు. ధూప, దీప, కర్పూర హారతి సమర్పించారు. పురవీధుల్లో స్వామి అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరసిద్ధుని హుండీ ఆదాయం రూ.1.78 కోట్లు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి హుండీ ద్వారా రూ.1.78 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గత 21 రోజులుగా భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను బుధవారం ఉదయం లెక్కించారు. ఇందులో 56 గ్రాముల బంగారం, 570 గ్రాముల వెండి, గో సంరక్షణ ట్రస్టు హుండీ ద్వారా రూ.11 వేలు, ఫారిన్ కరెన్సీతో కలిపి మొత్తం రూ.1.78 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్, ఈఓ వెల్లడించారు. ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడారంగానికి మహర్దశ



క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి రోజా, వీసీ భారతి తదితరులు



గౌరవ వందన చేస్తున్న క్రీడాకారులు

- సౌత్‌జోన్ మహిళల వాలీబాల్ టోర్నీ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా

తిరుపతి సిటీ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో క్రీడారంగానికి మహర్దశ పట్టిందని, విదార్థినులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. బుధవారం శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఐదురోజుల పాటు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ మహిళల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఆరు రాష్ట్రాలకు చెందిన సుమారు 89 యూనివర్సిటీల నుంచి విచ్చేసి క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించడం శుభపరిణామమన్నారు. స్పోర్ట్స్‌తో విదార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని వెల్లడించారు. ఉపాధి, ఉద్యోగాలతో పాటు ఉన్నత చదువుల్లోనూ ప్రత్యేక కోటా ఉందని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థినులు తమ యూనివర్సిటీ పేరు ప్రతిష్టలను ఇనుమడించేలా ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. క్రీడాకారులకు మాత్రమే రాష్ట్రంతోపాటు దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని వివరించారు. చదువుకే పరిమితం కాకుండా వ్యాయామం , క్రీడల్లో పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆడుదాం ఆంధ్ర క్రీడల పండుగ జరుగుతోందని వెల్లడించారు. మొత్తం 15వేల సచివాలయాల పరిధిలో గ్రామీణ. పట్టణ ప్రాంత యువతలోని ప్రతిభను వెలికితీయడమే ఆడుదాం ఆంధ్ర ఉద్దేశమని వివరించారు. ఈ క్రమంలోనే పోటీల్లో పాల్గొంటున్న 91 జట్లను మంత్రి పరిచయం చేసుకుంటూ వారితో సెల్ఫీలు దిగారు. అనంతరం క్రీడాకారులతో వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి రోజాను వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సారా సరోజిని, టీటీడీ స్పోర్ట్స్ ఆఫీసర్ భాస్కర్, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, తులసిరెడ్డి పాల్గొన్నారు.

1న పీఎస్ఎల్వీ సీ58 ప్రయోగం



రాకెట్‌లో ఇంధన నింపుతున్న దృశ్యం



అమర్చేందుకు సిద్ధంగా ఉపగ్రహం

సూళ్లూరుపేట : శ్రీహరికోట షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి జనవరి 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు పీఎస్ఎల్వీ సీ58 రాకెట్ ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 31వ తేదీ ఉదయం 9.30 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో 30వ తేదీన ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించనున్నారు. పీఎస్ఎల్వీ రాకెట్ సిరీస్‌లో అత్యంత తేలికైన పీఎస్ఎల్వీ-డీఎల్ ప్రయోగం నిర్వహించేందుకు రాకెట్ అనుసంధానం పనులను బుధవారం నాటికి పూర్తి చేశారు. ఈ రాకెట్ ద్వారా ఖగోళ పరిశోధనలకు ఉపయోగపడే 480 కిలోల ఎక్స్‌పోశాట్ ఉపగ్రహం ప్రయోగించనున్నారు. దీంతో పాటు కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన కేజీ బరువు కలిగిన వియ్‌శాట్ అనే బుల్లి ఉపగ్రహాన్ని కూడా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. భూమికి అత్యంత తక్కువ దూరంలో ఉన్న లియో ఆర్బిట్‌లోకి ఈ రెండు ఉపగ్రహాలను పంపేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు నాలుగు దశల రాకెట్ అనుసంధాన పనుల చిత్రాలను శాస్త్రవేత్తలు విడుదల చేశారు.

వెండి కిరీటం.. కర్ణ పత్రాల వితరణ



వెండి వస్తువులను అందిస్తున్న దాతలు

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లెలో ఉన్న శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయానికి బుధవారం తమిళనాడుకు చెందిన దాతలు వెండి కిరీటం, కర్ణపత్రాలను వితరణగా అందించారు. సేలం సేవాపేట ప్రాంతానికి చెందిన దాత కేవీ నందగోపాల్, కుటుంబ సభ్యులు సుమారు రూ.1.90లక్షల విలువైన 2,427 గ్రాముల వెండి వస్తువులను సర్వమంగళ అమ్మవారి అలంకరణ నిమిత్తం ఆలయ కమిటీ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డికి అందజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.మునివేలు, ఎస్.మంజుల ఉమాపతి, అర్చకుడు కె.కార్తికేయన్ పాల్గొన్నారు.

'అంకుర' శిక్షణకు దరఖాస్తులు



ప్రకటన ప్రతి ఆవిష్కరిస్తున్న వీసీ శారదా జయలక్ష్మి తదితరులు

తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని అగ్రి ఇంక్యుబేటర్ సంస్థ ఆధ్వర్యంలో అంకుర సంస్థల ఏర్పాటుకు ఆసక్తిగల వారికి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. బుధవారం ఈ మేరకు కళాశాల ఆవరణలో ప్రకటన విడుదల చేశారు. ఆర్‌కేవీవై పథకం ద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రైతుల సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలను చేయగల ఔత్సాహికులు విద్యార్హతతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. 2019 నుంచి ఇప్పటి వరకు 6 బ్యాచ్‌లకు విజయవంతంగా శిక్షణ ఇవ్వడంతోపాటు, అంకుర సంస్థల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించామని వివరించారు. నూతన బ్యాచ్‌లో ఔత్సాహికులకు రెండు విభాగాల కింద కేంద్ర ప్రభుత్వం సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జనవరి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 94416 70829 నంబరులో సంప్రదించవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ విస్తరణ సంచాలకుడు డాక్టర్ సుబ్బరామి రెడ్డి, సహ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రభాకర్ రెడ్డి, ఇంక్యుబేటర్ ప్రధాన అధికారి డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి, బిజినెస్ మేనేజర్ లక్ష్మీతులసి పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లో సేంద్రియ ఉత్పత్తులు

చంద్రగిరి : పొదుపు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ మహిళా మార్టులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రాష్ట్ర కమ్యూనిటీ నేచరల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం తెలిపారు. బుధవారం ఆయన ఆర్ఎఫ్ రోడ్డులోని వైఎస్సార్ మహిళా మార్టులో ఉత్పత్తుల విక్రయాలను ప్రారంభించారు. షణ్ముగం మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అందుకే వైఎస్సార్ మహిళా మార్టులో ప్రజలకు అందుబాటులో ఉంచామని, సరసమైన ధరలు కూడా నిర్ణయించినట్లు వెల్లడించారు. దేశవాళీ బియ్యంలో బ్లాక్ రైస్, నవరా, షుగర్ లెస్, మైసూర్ మల్లిగా, బ్రౌన్ రైసులు ఉన్నాయని, అలాగే రాగులు, సజ్జలు, జొన్నలు,


స్టాల్స్ ప్రారంభిస్తున్న డీపీఎం షణ్ముగం తదితరులు

కొర్రలు, రాగిపిండి, సజ్జ పిండి, ఇడ్లీ రవ్వ, బెల్లం, వేరుశెనగ పప్పులతో పాటు పలు రకాల నూనెలను కూడా అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, మహిళా మార్టు డీపీఎం వనజాక్షి, ఎస్ఎఫ్ఏ మధు, శ్రీదేవి, రాఘవమ్మ పాల్గొన్నారు.

యువకుడి మృతి కేసులో ఇద్దరికి రిమాండ్

కేవీబీపురం : పొలం వద్ద అక్రమంగా అమర్చిన విద్యుత్ ఉచ్చుకు బలైన ఓ గిరిజన యువకుడి కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులకు కోర్టు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈనెల 23 తేదిన సురేష్, భూపతి అనే యువకు పాతపాళెం అటవీప్రాంతానికి వెళుతుండగా మునీంద్రయ్య అనే వ్యక్తి తన పొలంలో ఏర్పాటు చేసిన కరెంట్ ఉచ్చు తగిలింది. దీంతో సురేష్ అక్కడికక్కడే మరణించాడు. ఘటన చూసి భయాందోళనకు గురైన భూపతి అక్కడ నుంచి పరారయ్యాడు. అయితే యువకుడు మృతి చెందిన విషయం బయటకు పొక్కకుండా మునీంద్రయ్య, గ్రామానికి చెందిన రాజగోపాల్ అనే వ్యక్తి సాయంతో మృతదేహాన్ని అడవిలోకి తీసుకెళ్లి పూడ్చేశాడు. మృతుడి భార్య మునిలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ప్రతిభను ప్రదర్శించిన ఏఎస్ఐ లోకనాథం, హెడ్‌కానిస్టేబుళ్లు అమరనాథ్‌నాయుడు, విశ్వనాథం, కానిస్టేబుళ్లు ప్రభాకర్, కలాం, దాము, దయాకర్‌ను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ సునీల్ పాల్గొన్నారు.


నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

భూమనతోనే బలిజ బిడ్డల భవిష్యత్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన బలిజ కులస్తులు

- అభినయ్‌కు అండగా ఉంటాం
- తిరుపతి, తిరుమల బలిజ ఆత్మీయ సమావేశంలో నేతలు

తిరుపతి మంగళం : బలిజ బిడ్డల భవిష్యత్‌కు టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కృషి చేస్తున్నారని తిరుపతి, తిరుమల బలిజ సంఘం నేతలు స్పష్టం చేశారు. బుధవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఆధ్వర్యంలో బలిజల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. సంఘం నేతలు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్ అధ్యక్షత వహించిన సమావేశంలో పలువురు ప్రసంగించారు. భూమన అభినయ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి కరుణాకరరెడ్డికి సగర్వంగా కానుక అందిస్తామని తెలిపారు. కులం పేరు చెప్పుకుని మోసం చేసేందుకు వచ్చే నాయకులకు బుద్ధి చెబుతామన్నారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు నాయుడు స్వార్థ రాజకీయాలకు బలిజలు మరోసారి బలి కాకూడదని హెచ్చరించారు. తిరుపతిలో బలిజలకు నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులు అందించిన ఘనత భూమన కుటుంబానికే దక్కుతుందన్నారు. బలిజ కులస్తులు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు చైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఇంతటి ప్రాధాన్యత, గుర్తింపు దక్కలేదని వివరించారు. తిరుపతిలో బలిజ భవన్ నిర్మాణానికి కరుణాకరరెడ్డి ఆర్థిక సాయం చేశారని గుర్తుచేశారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరునగరిని అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత భూమన అభినయ్‌కు దక్కుతుందన్నారు. శెట్టిపల్లె లో వందేళ్ల భూ సమస్యను సులువుగా పరిష్కరించారని కొనియాడారు. వై తిరుపతి నీడ్స్ అభినయ్ అనే నినాదాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బలిజ సంఘాల నాయకులు ముద్ర నారాయణ, నీలం బాలాజి, నందగోపాల్, చిన్నముని, సురేష్, నైనారు శ్రీనివాసులు, కేఎం సత్యనారాయణ, సంతోష్, దూది శివ, దినేష్‌రాయల్, చీర్ల కిరణ్, చందు రాయల్, శెట్టిపల్లె ఉపసర్పంచ్ రామకృష్ణ, మధుబాల, బాలిశెట్టి కిషోర్ ప్రసంగించారు.

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం

టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ఊపిరి ఉన్నంతవరకు ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.


బలిజ నేత ముద్రనారాయణతో అభినయ్ ఆత్మీయ ఆలింగనం

కుల, మతాలతో రాజకీయం చేయమన్నారు. 1972లో తనను తొలిసారి రాజకీయాల్లోకి తీసుకువచ్చిన వారిలో ఒకరైన ఎన్.శ్రీధర్, మిత్రుడు చంద్రభూషణ్ బలిజలని వారు చనిపోయాకే తెలిసిందని చెప్పారు. అప్పట్లో ఎంఏ చదివే అవకాశం వచ్చిన కుల రాజకీయాలు చూసి దరఖాస్తు వెనక్కు తెచ్చుకున్నట్లు వెల్లడించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తామని, తిరుపతి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని నమ్మితేనే అభినయ్‌కు ఓటేయాలని విన్నవించారు.

మీ బిడ్డగా ముందుకు వస్తున్నా..

డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. మీ బిడ్డగా ముందుకు వస్తున్న తనను ఆదరించాలని కోరారు. రెండేళ్లలో ఏం చేశానో చెప్పే ఓట్లడుగుతున్నానని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో మీ కోసం పనిచేసే వారు కావాలో? కులం పేరుతో ప్రయోజనం పొందేవారు కావాలో బలిజలంతా ఆలోచించించి ఓటేయాలని విన్నవించారు. తిరుపతిని నేర రహితంగా, దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే 16 మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించామని, రాబోయే రెండేళ్లలో మరో 12 రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. శెట్టిపల్లెకు ఐటీ పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.

నిరుపేదలకు 'నీడ' కుదిరె!

నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు. ముందుగా అత్యాధునిక మౌలిక వసతులతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. అనంతరం అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేశారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం అందజేశారు. అధికార యంత్రాంగానికి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ జిల్లావ్యాప్తంగా వేలాది మంది బడుగుజీవులను నీడ కల్పించడంలో సఫలీకృతులయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంపై లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..

– తిరుపతి అర్బన్



కాయం లేఅవుట్‌లో జగనన్న ఇళ్లు

పేదలకు న్యాయం



నేను వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇద్దరు కుమార్తెలను చదివించుకునేందుకే గతంలో చాలా ఇబ్బంది పడేదాన్ని. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మా బిడ్డల చదువుకు సాయం అందుతోంది. అలాగే ఏళ్ల తరబడి చిన్నపాటి గుడిసెలో నివసిస్తున్న మాకు పక్కా ఇల్లు కట్టుకునే అవకాశం వచ్చింది. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో చక్కటి గృహం నిర్మించుకుంటున్నాం. ప్రస్తుతం అది చివరి దశలో ఉంది. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి గృహప్రవేశం చేయనున్నాం. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో మాలాంటి పేదలకు న్యాయం జరుగుతోంది.

– తమ్మిశెట్టి మంగమ్మ , దక్కిలి

కల నెరవేరింది



నా భర్త ఓ కూలి పని చేస్తేనే మా ఇల్లు గడుస్తుంది. అద్దె ఇంటిలోనే దశాబ్దాలుగా జీవిస్తున్నాం. ఇక ఇల్లు కట్టుకోవడమనేది మాకు తీరని కలే. అయితే ముఖ్యమంత్రి జగనన్న చలువతో మా కల నెరవేరింది. వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారానికే ముందుగా ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం చేయూతతో నాలుగు నెలల్లోనే గృహ నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడ వల్లే ఇంత త్వరగా ఇల్లు కట్టగలిగాం. మళ్లీ మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– కళావతి, ఇందిరానగర్, నారాయణవనం

ఖరీదైన స్థలం



జగనన్న కాలనీలో ప్రభుత్వం మాకు ఖరీదైన స్థలం కేటాయించింది. 1.5 సెంట్లు దాదాపు రూ.7.5 లక్షల వరకు పలుకుతోంది. నా భర్త ఓ బాడుగ వాహనం నడుపుతున్నాడు. నేను ఇంట్లో టైలరింగ్ ద్వారా జీవనం సాగిస్తున్నాం. ఇంత పెద్ద మొత్తం పెట్టి స్థలం కొని ఇల్లు కట్టుకునే పరిస్థితి మాకు లేదు. జగనన్న మంచి మనసుతో ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాం. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో పూర్తి చేసుకున్నాం. ఏడాది నుంచి సొంతింటిలోనే నివసిస్తున్నాం. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ప్రమీల, జగనన్న కాలనీ, పిచ్చాటూరు.

అద్దె కష్టాలు తీరాయి



సుమారు 25 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం తమిళనాడులోని ఊతుకోట నుంచి దక్కిలికి వచ్చాం. ఇక్కడే కూల్ డ్రింక్ షాపు నిర్వహిస్తూ పొట్టపోసుకుంటున్నాం. వచ్చినప్పటి నుంచి అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఇన్నేళ్లకు సొంతిల్లు కట్టుకోగలిగాం. దశాబ్దాల అద్దె కష్టాలు తీరాయి. మాది అనే గృహంలో గుండెల మీద చేయివేసుకుని హాయిగా నిద్రించే అవకాశం వచ్చింది. ముఖ్యమంత్రి మేలు ఎన్నటికీ మరువలేం.

– వేముల రాజేశ్వరి, దక్కిలి

రుణపడి ఉంటాం



నా భర్త టాక్సీ నడుపుతుంటాడు. ఆయన సంపాదనతోనే జీవనం సాగిస్తున్నాం. సొంత ఇల్లు నిర్మించుకునే శక్తి లేకపోవడంతో అద్దె గృహంలోనే నివాసం ఉంటున్నాం. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలం ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణానికి సహకారం అందించారు. ఇప్పుడు ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకుని అందులోనే నివసిస్తున్నాం. అలాగే నా భర్తకు వద్ధాప్య పింఛను, వాహన మిత్ర, ఈబీసీ ద్వారా రూ.15వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.14వేలు, జగనన్న చేదోడు కింద నేను ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి రూ.10వేలు వస్తోంది. ఇంతకన్నా ఇంకేం కావాలి. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– హైమావతి, జగనన్న కాలనీ, అగరాల

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం'


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మోహిత్ రెడ్డి


క్రీడాకారులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి (తిరుచానూరు) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం మంగళం, తిరుచానూరు, కొత్తూరు, చంద్రగిరి మండలంలోని అగరాల పంచాయతీల పరిధిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీలను పర్యవేక్షించారు. ఆయా మైదానాలకు వెళ్లి ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కొద్దిసేపు బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పోటీలు దేశంలోనే అతి పెద మెగా టోర్నీగా అభివర్ణించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, యశోద, సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి, ఎంపీడీఓ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

శ్రీగంధం పట్టివేత

– ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న అటవీ సిబ్బంది

భాకరాపేట : మండలంలోని చిన్నగొట్టిగల్లు వద్ద ఆటోలో తరలిస్తున్న శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పీలేరు రహదారిలో వెళుతున్న ఆటోలో శ్రీగంధం తరలిస్తున్న సమాచారం అందగానే వెంబడించి సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఆటోను స్వాధీనం చేసుకుని వక్కల సురేంద్ర, నరేంద్ర అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వివరించారు. పట్టుబడిన శ్రీగంధం విలువ సుమారు రూ.1.35లక్షలు ఉంటుందని తెలిపారు. దాడిలో ఎఫ్ఎస్ఓ తౌఫిక్‌ఇస్లాం, సదాశివయ్య, రాజేష్, శంకర్ పాల్గొన్నారు.

తిరుమల నంబి వంశీయుడి కన్నుమూత


శ్రీకృష్ణస్వామి తాతాచార్య (ఫైల్)

తిరుమల : తిరుమల నంబి ఆలయ నిర్మాణానికి కృషిచేసిన తిరుమలనంబి వంశీయుడు తోడప్పాచార్యులు శ్రీకృష్ణస్వామి తాతాచార్య(70) బుధవారం తిరుపతిలోని తన స్వగృహంలో పరమపదించారు. టీటీడీలో ప్రదమాచార్య పురుషుడిగా ఆయన కొన్ని దశాబ్దాలు పాటు సేవలందించారు. తిరుమల దక్షిణమాడవీధిలోని తిరుమల నంబి ఆలయ నిర్మాణానికి కృషిచేశారు. ప్రస్తుతం ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

కోట: విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని కొత్తపాళెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపాళెంకు చెందిన వరలక్ష్మి(35) ఇంటి సమీపంలో విద్యుత్ తీగ తెగి పడింది. దాన్ని గమనించకుండా వరలక్ష్మి రోడ్డుపైకి రావడంతో తీగ తగలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో ఆమె కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.